# నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
## నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET




హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య,మహేశ్‌రెడ్డి, నాయకులు ఆర్‌ఎస్‌పీ, ఆంజనేయగౌడ్ హాజరయ్యారు.



బాధితుడు ఎల్లప్పను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు

- కొడంగల్‌లో మితిమీరుతున్న కాంగ్రెస్ నేతల ఆగడాలు
- అల్లీపూర్ ఘటనలో సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (కొత్తపల్లి) ఫిబ్రవరి 19 : కొడంగల్ నియోజకవర్గంలో రోజురోజుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి.. ప్రశ్నించిన వారిపై పోలీసుల అండదండలతో దాడులు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి.. లేకపోతే కొడంగల్‌లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు, మద్దూర్ మండలం బంద్ నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే పట్నం స్పష్టం చేశారు. బుధవారం అల్లీపూర్ బాధితుడిని గ్రామానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లీ పూర్ గ్రామానికి చెందిన భీమమ్మ ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్‌గా పనిచేస్తుంది. మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో ఆవిషయాన్ని పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ అడుగగా రాజకీయ అండదండతో అక్రమ కేసు బనాయించి పోలీసులతో బాధించడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన సంబంధిత పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తూ మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. బాధితులపై చర్యలు తీసుకోకపోతే కొడంగల్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అలాగే మద్దూర్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ఓ వైపు ప్రజా పాలన అంటూనే ప్రజలపై సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనవతరం బాధితుడు ఎల్లప్పకు దవాఖాన ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. నేను మీకు అండగా ఉంటా అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మద్దూర్, కొత్తపల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మధు సూదన్‌రెడ్డి, నాయకుడు సలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



జడ్చర్లలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి
- పోరాట యోధుడు ఛత్రపతి
- ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్
- ఐతోలులో శివాజీ విగ్రహావిష్కరణ

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి19 : ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం జడ్చర్ల పట్టణంలోని పాతబజార్‌లో శివాజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని పరిశీలించి రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యాదయ్య, పట్టణ అధ్యక్షుడు మురళి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఐతోలులో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రముఖ సినీదర్శకుడు నాగ్‌అశ్విన్

### ఐతోలులో శివాజీ విగ్రహావిష్కరణ

తాడూరు, ఫిబ్రవరి 19 : నాటి సమాజంలో జరుగుతున్న ఆరాచకాలను అంతమొందించాలనే ఉద్దేశంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలతో ఎదురొడ్డి పోరాడిన యోధుడు అని ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. మండలంలోని ఐతోలులో గ్రామస్తుల సహకారంతో బుధవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి బావిభారత పౌరులని కొనియాడారు. ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభోత్సవానికి ఆహ్వానించినందుకుగానూ గ్రామ స్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ హుస్సేన్ జీ, వెంకట్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, భీంరెడ్డి, చిన్నారెడ్డి, రమేశ్ గౌడ్, హరికృష్ణశర్మ, అఖిల్‌రెడ్డి, రాంకిషన్‌జీ, మల్లేశ్‌తో పాటు విద్యార్థులు, యువకులు, వివిధ గ్రామాలకు చెందిన నాగ్ అశ్విన్ అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్డీఎస్‌లో పెరిగిన నీటి నిల్వ

- ప్రధానకాల్వకు 594 క్యూసెక్కులు విడుదల
- ఆనకట్టలో 8.5అడుగులకు చేరిన నీటిమట్టం
- టీబీ డ్యాంలో నీటిమట్టం 39.697టీఎంసీలు

అయిజ, ఫిబ్రవరి 19 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా నీరు చేరుతున్నది. టీబీ డ్యాం నుంచి విడుదలైన జాయింట్ ఇండెంట్ నీరు భారీగా చేరుతుండటంతో ఆర్డీఎస్‌లో నీటి నిల్వ క్రమేపీ పెరుగుతున్నది. దీంతో బుధవారం ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 594 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.5 అడుగుల మేర నీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆర్డీఎస్ కాల్వకు నీరు చేరుతుండటంతో అయిజ మండలంలోని ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని రైతులు నీటిని పంటలకు పారించుకోవాలని ఈఈ సూచించారు.

**టీబీ డ్యాంలో..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ క్రమేపీ తగ్గుతున్నది. కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని సాగు, తాగునీటి అవసరాలకు నీటిని టీబీ డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. బుధవారం అవుట్‌ఫ్లో 9,115 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 39.697టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1611.06 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

# అంతా భ్రాంతియేనా..?

- పలువురు రైతులకు అందని రైతు భరోసా
- పలు చోట్ల సాగు భూముల గల్లంతు
- ఆరా తీస్తే అసలు విషయం వెల్లడి
- సాగు భూములపై ప్రభుత్వం శీతకన్ను
- ఆందోళనలో కందనూలు జిల్లా రైతులు
- దిక్కుతోచని స్థితిలో వ్యవసాయశాఖ అధికారులు



వ్యవసాయ పొలాన్ని సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్, ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అర్హులకు మాత్రమే రావాలని సాగుయేతర భూములకు అవసరం లేదని హడావిడిగా చేపట్టిన సర్వే రైతులను ఆందోళనలోకి నెట్టివేసింది. రైతు భరోసా కోసం దర ఖాస్తు చేసుకునేందుకు గత సెలాఖరులో టార్గెట్ పెట్టడంతో రైతులు అవస్థలు పడ్డారు. రైతుల సంగతి అటు ఉంచితే రైతు భరోసా భారం తగ్గించుకునేందుకు వ్యవసాయాధికారులను ఉరుకులు పరుగులు పెట్టించింది. రైతు భరోసా డబ్బులు ఎకరాలోపు రైతులందరికీ పడినట్లు ప్రభుత్వం చెబుతున్నా చాలామంది డబ్బులు ఎప్పుడు వస్తాయని ఫోన్ దగ్గర పెట్టుకొని టకీటకీ మెసేజీల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం రైతులను గందర గోళంలో పెట్టి అసలు విషయాన్ని దాచిపెడుతున్నది. రైతులకు నిజాన్ని నిర్భయంగా వెల్లడించేందుకు నమస్తే తెలంగాణ సాగుయోగ్యం కానీ భూముల సర్వేపై ఆరా తీసింది.

**రైతు భరోసా షాక్**

రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్లు రైతులను మభ్య పెడుతున్నది. రైతులు మాత్రం రైతు భరోసా డబ్బుల కోసం సెల్ ఫోన్లను దగ్గర పెట్టుకొని అంతా భ్రాంతియేనా అంటూ నిట్టూర్పుగా ఎదురు చూస్తున్నారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలు లేకుండా రైతు భరోసా భారం నుంచి తప్పించుకునేందుకు సాగుకు యోగ్యం కానీ భూముల సర్వేను తెరపైకి తెచ్చింది. సాగుయోగ్యం కానీ భూ ముల సర్వేపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి సర్వే ఆధారంగా రైతుభరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే సర్వేలో అధికార పార్టీ నాయకుల పెత్తనం అధికారులపై ఉండడంతో చాలావరకు అధికార పార్టీ నాయకుల సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలు రికార్డుల్లో చేరలేదు. కాని విపక్ష పార్టీ నాయకులు, పేద రైతుల సాగుయోగ్యం కాని భూముల వివరాలు పక్కాగా రికార్డుల్లోకి ఎక్కాయి.

**సాగుపై ప్రభావం**

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 7,45,684.1 క్లియర్ ల్యాండ్ ఉంటే శుక్రవారం నాటికి 7771.91 ఎకరాలను వ్యవసాయేతర భూములుగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 7771.91 ఎకరాలకు రైతుభరోసా రాదు. గోదాములు, కోళ్ల ఫారం, ఇతర కమర్షియల్ భూములు మినహాయించి మిగిలిన భూములు మళ్లీ సాగులోకి తెచ్చుకొనేందుకు అవకాశం ఉంది. సర్వేలో గుర్తించిన భూములను అధికారులు అధికారికంగా రికార్డుల్లో నమోదు కూడా చేశారు. ఒకవేళ సాగులోకి వచ్చిన భూమికి రైతు భరోసా వచ్చేందుకు ముందు రికార్డుల్లో వ్యవసాయేతర భూముల జాబితా నుంచి తొలగించాలి.. కానీ ప్రస్తుతానికి ఆ సౌకర్యం లేదని తెలుస్తోంది.

**దిక్కుతోచని స్థితిలో వ్యవసాయాధికారులు**

రాష్ట్రంలో వ్యవసాయ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారింది. వ్యవసాయేతర భూముల సర్వేపై అధికారికంగా ఎలాంటి ఆదేశాలు లేవు. సర్వేలో గందరగోళ పరిస్థితిపై సందేహాలపై రైతులు అడిగే ప్రశ్నలకు వ్యవసాయ అధికారుల వద్ద సమాధానాలు లేవు. ఉదాహరణకు ఒక సర్వే నెంబరులో ఐదెకరాల భూమి ఉంటే అందులో 20 గుంటలు వ్యవసాయేతర భూమిని మాత్రమే రికార్డుల్లోకి ఎక్కించే ఆప్షన్ లేదు. నిషేధిత జాబితాలోకి ఎక్కించాలంటే సర్వే నెంబరులోని భూమి మొత్తాన్ని ఎక్కించాలి. లేదంటే పూర్తిగా వదిలేయాలి. ఇలాంటి పరిస్థితిలో రైతు భరోసా డబ్బులు పడని రైతులు తమ కార్యాలయాలపై దండయాత్ర చేస్తున్నారని వ్యవసాయాధికారులు భయపడుతున్నారు. ఇటీవల కొల్లాపూర్ మండలంలోని చింతలపల్లికి చెందిన ఓ రైతు వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చి ఏవోను బెదరించి వెళ్లాడు. ప్రభుత్వం చేసిన తప్పిదానికి అధికారులు బలవుతున్నారు.

**కల్లాలు, దొడ్లు వ్యవసాయేతర జాబితాలోకి..**

వ్యవసాయ అవసరాల కోసం విని యోగించే కల్లాలు, దొడ్లు కూడా రైతుల అనుమతి లేకుండానే నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. ప్రతిరైతు గ్రామంలో పుశువుల కోసం వాటి మేతకోసం కల్లాలు, దొడ్లను ఏర్పాటు చేసుకొని అనాదిగా వాడుతున్నారు. ఇప్పటికీ వ్యవసాయ అవసరాలకు విని యోగిస్తున్నారు. అంతేకాదు పొలాల్లో గుంట, రెండు గుంట ల్లో నట్లు (రాయి) ఉంటే వాటిని తీయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో అలాగే వదలిపెట్టారు. గతంలో కేసీఆర్ సమయంలో వచ్చిన రైతుబంధు డబ్బులతో నట్లను తీయించుకున్నారు ఇప్పుడు వాటిని జమా ఖర్చుల్లో రైతు భరోసా నుంచి తప్పించారు. ఇప్పుడు సొంత డబ్బుతో పొలాల్లో పాట్లను తీసివేసి సాగులోకి తెచ్చుకున్న రైతుభరోసా డబ్బులు పడే అవకాశం లేకుండా ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది.

### రైతు వ్యతిరేక ప్రభుత్వం



వ్యవసాయేతర భూముల పేరుతో కల్లాలు, దొడ్ల కు రైతు పొలాల్లో ఉండే నట్లకు రైతు భరోసా చెల్లించకుండా రైతుల ను వ్యవసాయం నుంచి దూరం చేసేందుకు కుట్ర చేసింది. ఇచ్చే రైతుభరోసా కూడా కొంత మందికి మాత్రమే ఇచ్చి చేతులను దూలుపుకున్నది. ఇది ప్రజావ్యతిరేక ప్రభుత్వంతో పాటు రైతువ్యతిరేక ప్రభుత్వం.

– దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

### రైతును ఇబ్బంది పెట్టొద్దు



అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతుభరోసా ఇవ్వాలి. రైతుభరోసాలో మినహాంపుల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు. రైతులు సాగులోకి తెచ్చుకున్న భూములను నిషేధిత జాబితా నుంచి ఎప్పుడు తొలగిస్తారనేది కూడా అధికారుల వద్ద స్పష్టత లేదు. దీని వల్ల రైతులకు ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలి

– బాలపీరు, రైతు సంఘం మండల కార్యదర్శి

### రైతులకు అన్యాయం



నాకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో రాళ్లు ఉన్నాయి. వానకాలం పంట సాగు చేశా. ఇప్పుడు వ్యవసాయానికి పనికి రాదని రైతు భరోసా రాదని చెబుతున్నారు. ప్రభుత్వం ముందు వ్యవసాయం కింద పెట్టుబడి సాయం అందిస్తే సాగులోకి తెచ్చుకుంటాం. నిషేధిత జాబితాలో వేస్తే నేను సాగులోకి తెచ్చుకున్న తర్వాత నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అవకాశం లేదు.

– నిరంజన్, రైతు

# రోడ్డెక్కిన నిర్వాసితులు

- భిక్షాటనకు బయలుదేరిన 'ఉదండాపూర్' బాధితులను అడ్డుకున్న పోలీసులు
- న్యాయం జరగడంలేదంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని రైతు ఆత్మహత్యాయత్నం
- ఎమ్మెల్యే హామీమేరకు రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలి
- భూనిర్వాసితుల డిమాండ్




జడ్చర్లలో భిక్షాటన నిర్వహించేందుకు ర్యాలీగా వస్తున్న ఉదండాపూర్ నిర్వాసితులు

జడ్చర్ల, ఫిబ్రవరి 19 : వారం రోజులుగా పునరావాస ప్యాకేజీ ఇవ్వాలంటూ ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో బుధవారం నిర్వాసితులు భిక్షాటన చేయడానికి రోడ్డెక్కారు. భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదంటూ ఐదారు రోజులుగా రిజర్వాయర్ కట్టపై ఉదండాపూర్ గ్రామానికి చెందిన నిర్వాసితులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జడ్చర్ల పట్టణంలో భిక్షాటన చేయాలని బయలుదేరి వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు భిక్షాటనకు పర్మిషన్ లేదంటూ జడ్చర్ల ప్రభుత్వ అతిథి గృహం వద్ద జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్, రూరల్ సీఐ నాగార్జున గౌడ్‌ఆధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొన్నది. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిర్వాసితులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. ఈ సమయంలో తమకు న్యాయం జరగడంలేదని, ప్యాకేజీ ఇవ్వడంలేదంటూ మల్లయ్య అనే రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. దీనిని గమనించిన పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసులు నిర్వాసితులను పోలీస్ స్టేషన్ వరకు తరలించి డీఎస్పీ వెంకటేశ్వర్లుతో మాట్లాడించారు. ఆర్డీవో గురువారం రిజర్వాయర్ వద్దకు వస్తారని, పరిహారం విషయంపై ఆయన మాట్లాడుతారని అందుకని భిక్షాటన చేయవద్దని, భిక్షాటన చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వారికి నచ్చజెప్పి పంపించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు మాట్లాడుతూ తమ భూములు లాక్కొని తమకు నిల్వనీడలేకుండా చేసి పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తూ తమ జీవితాలతో ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాపై కేసులు పెట్టినా సరే తమ దీక్షలను కొనసాగిస్తామని, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రులు వచ్చి ఆరు నెలలు దాటిపోయినా నేటి వరకు ప్యాకేజీ డబ్బులు ఇవ్వలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా భూములను తీసుకొని ఇండ్లకు సంబంధించిన సర్వే చేసిన సమయంలో 18ఏండ్లు నిండని వారిని పరిహారం పరిధిలోకి తీసుకోలేదని, ఇప్పుడు 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

తమకు న్యాయం జరిగే వరకు ఎవన్ని ఇబ్బందులకు గురి చేసినా భయపడేదిలేదని, తాము నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామని హెచ్చరించారు.



జడ్చర్లలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించిన నిర్వాసితులు

# ఈవోపై రహస్య విచారణ !

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై ఇన్వెస్టిగేషన్
- రూ. 200కోట్ల అవకతవకలకు పాల్పడినట్లు అనుమానాలు
- రాజకీయ నాయకుల అండదండలతో బయటపడని నిజాలు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 19 : కొంతకాలంగా జిల్లాలో ఆయా ఆలయాల్లో ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి అధికార ముసుగులో పెద్దమొత్తంలో డబ్బులు కాజేసినట్లు అధికార పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు ఆరోపించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారి ఆలయానికి వచ్చే కానుకలు, చెక్కుల వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు ఏకంగా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో యువ నాయకుడి ఫిర్యాదుతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు రంగం ప్రవేశం చేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై రహస్య విచారణ చేపట్టినట్లు తెలిసింది. సదరు అధికారి ఆయా ఆలయాల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విషయం విధితమే. అధికారి గత కొన్నేండ్లుగాజిల్లాను దాటి మరే ఏ ప్రాంతానికి వెళ్లకుండా ఇక్కడే విధులు నిర్వర్తించడంపై పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అధికారి జిల్లాలో ఉద్యోగం చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.200 కోట్లు కాజేసినట్లు పుకార్లు షికార్లు చేయడంతో అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు తెలిసింది. దేవాదాయ శాఖ అధికారుల తోపాటు సదరు అధికారిపై ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు అందడంతో ఏసీబీ అధికారులు కూడా కూపీ లాగుతున్నట్లు తెలిసింది. తన వ్యవహారం బయటపడకుండా ఉండేందుకు రాజకీయ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ తనపై ఎలాంటి ఆరోపణలు రాకుండా ఉండేందుకు వారి ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. విచారణకు వచ్చిన అధికారులు సదరు అధికారి జిల్లాలో ఉద్యోగం చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు నిష్పక్షపాతంగా విచారణ చేస్తే నమ్మలేని నిజాలు బయటపడే అవకాశం ఉందని సమాచారం.